# ప్రజా వాగ్గేయకారుడు కామ్రేడ్ గద్దర్‌కి జోహార్లు!



**గద్దర్** ప్రజా వాగ్గేయకారుడు, ఆశు కవి, ప్రజాజీవితంలో పీడిత వర్గాల, కులాల, వృత్తుల దుర్భర కష్టాలను గానం చేసిన గాయకుడు. కష్టజీవులను, బాధిత ప్రజలను స్పందింపజేసిన, మధ్యతరగతి వర్గాలను రంజింపచేసిన, స్వార్థపర బూర్జువా కళా బృందాలకు నోరూరుంచిన మహాగాయకుడు. ఆయన మరణించాడు కానీ ఆయన గానం వినిపిస్తూనే వుంటుంది.

విప్లవోద్యమంలో భాగంగా తనవంతు బరువుని తాను ఎత్తుకున్నాడు. జీవితంలోని ఒక దశలో పార్టీ సిద్ధాంతాలు, రాద్ధాంతాలు తనకవసరం లేదనుకున్నాడేమో, సామాన్య ప్రజల విశ్వాసాలతో జతకలసి నడిచాడు. భావవాద, మతవాద విశ్వాసాలతో వున్న ప్రజలను వాటి ద్వారా కూడా బయటకు లాగాలనుకున్నాడేమో, అందుచేతనే బతుకమ్మ, సీతమ్మల చుట్టూ తిరిగాడు.

అతని ఆవేదన, ఆక్రోశాలకు సమాధానాలు – సరైన సమాధానాలు – ఆయన దొరకబుచ్చుకోలేకపోయాడనిపిస్తుంది. ఆత్మ ఒక చోట ఒక విధంగా, చర్య మరోచోట మరో విధంగా మారిపోయాడనుకోవాలి. ఇది విప్లవోద్యమ సిద్ధాంత రాజకీయ, నిర్మాణ సంబంధమైన విషయంగా వుంటుంది. గద్దర్ దేని కోసమో పరితపిస్తున్నాడని దూరంగా వున్న నాకు, అతనితో ప్రత్యక్ష పరిచయం లేని నాకెలా తెలుస్తుంది? అయినా ఆయన ప్రజా విముక్తి కోసం పరితపిస్తున్నాడనుకుంటున్నాను. రాజ్యం ఆయనను అంతం చేయాలనుకుని కుట్ర పన్నిన సందర్భం – అదే రాజ్యశక్తులు ఆయనను కౌగిలించుకొంటున్న తీరు, దోపిడీవర్గ శక్తులు ప్రజల మనిషిని తమ మనిషిగా చాటుకోవాలనే దోపిడీవర్గ రాజకీయ వికృతాన్ని గద్దర్ గమనించకపోలేదు.

గద్దర్ పీడిత ప్రజల మనిషి. జాతి, కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా నిలిచిన మనిషి – కామ్రేడ్. అతనికి నా విప్లవ జోహార్లు! ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనుచరులు, సానుభూతిపరుల దుఃఖంలో పాలుపంచుకొంటున్నాను.

**27-8-2023** – విశ్వం